క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో సుమారు రూ.19.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శివప్రకాష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బస్తీ కమిటీ అధ్యక్షుడు కృష్ణ, పద్మారావు, శ్రీనివాస్, రఘునందన్, అనిల్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయిచరణ్ కాలనీలో 10లక్షల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాండుగౌడ్, శివరాజ్‌గౌడ్, వెంకట్‌నాయక్, లక్ష్మమ్మ, యడ్ల సత్యనారాయణ, సుందు యాదగిరి, పోశెట్టి గౌడ్, సుధాకర్‌రెడ్డి, వెంకటయ్య, ఏసుదాస్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాలా శ్లాబ్ పనుల పరిశీలన



ప్రశాంత్‌నగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

మోతీనగర్: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో మూసాపేట డివిజన్ స్నేహపురి కాలనీలో జరుగుతున్న నాలా శ్లాబ్ నిర్మాణ పనులను మంగళవారం మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పనులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌యస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తిరుపతి, కాలనీ అధ్యక్షుడు వినోద్ యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజు చారి, శేఖర్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

జులై 2న ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్

మోతీనగర్: అల్లాపూర్‌లోని శ్రీఅమృత కాలేజీలో రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌పై మంగళవారం విద్యార్థులకు ఎన్ఎస్‌యూఐ స్టేట్ జనరల్ సెక్రటరీ సయీద్ మిస్బా అవగాహన కల్పించారు. జులై 2వ తేదీన జరగనున్న ఈ కాంపిటీషన్‌లో విద్యార్థుల అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీబ్లాక్ అధ్యక్షుడు రాఘవేంద్ర, నాయకులు వేణు, ఇలియాస్, ప్రవీణ్‌గౌడ్, వంశీవర్ధన్, నిఖిల్, సాయి తేజ, సాయి మణికంఠ, గౌతమ్, ప్రణతి, తదితరులు పాల్గొన్నారు.

యూరో స్కూల్ మెట్రో గార్డెన్ క్యాంపస్ ప్రారంభం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని యూరో స్కూల్ మెట్రో గార్డెన్ తన ఫౌండింగ్ బ్యాచ్ కోసం అకడమిక్ సెషన్‌ను మంగళవారం ప్రారంభించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణు వందన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యూరో స్కూల్ హైదరాబాద్ హైటెక్స్ తర్వాత ఇది రెండో స్కూల్ క్యాంపస్ అని తెలిపారు. ఇది ప్రతి సంవత్సరం 10వ తరగతిలో విజయవంతమైన రికార్డులను నెలకొల్పిందన్నారు. క్యాంపస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి నవతరం నైపుణ్యాల అభివృద్ధితో విద్యార్థులను సన్నద్ధం చేయడానికి మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. ఈ క్యాంపస్‌ను 2వేల మందికి వసతి కల్పించేలా నిర్మించామన్నారు. జూనియర్ కేజీ నుంచి గ్రేడ్ 10 వరకు సీబీఎస్ఈ బోర్డుకు అనుబంధంగా ఉంటుందన్నారు.

ప్రొ.లింబాద్రికి శుభాకాంక్షలు

కేపీహెచ్‌బీకాలనీ: తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా నియమితులైన ప్రొఫెసర్ లింబాద్రి, వైస్ చైర్మన్ ఎస్‌కే మహమ్మద్‌లను జేఎస్‌టీయూహెచ్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థి నాయకులు మాట్లాడుతూ... సాంకేతిక విద్యను బడుగు, బలహీన వర్గాలకు అందించాలనే ఉద్దేశంతో ప్రొ. లింబాద్రిని నియమించడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మందల భాస్కర్, ఎరవెల్లి జగన్, లకవత్ భానుప్రకాష్ నాయక్, సైదులు, బత్తుల రామ్‌ప్రసాద్, అశోక్, సుశాంత్, నాగచంద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ వార్డు కార్యాలయం, సోమేశ్వర ఆలయం వద్ద డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు.

మ్యాన్‌హోల్









ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నోళ్లు తెరిచిన బ్యాన్‌హోళ్లు కనిపిస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ధ్వంసమైన మ్యాన్‌హోళ్ల మూతలు, ఒక అడుగు లోతు, ఎత్తులో ఉన్న మ్యాన్‌హోళ్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాదకరమని తెలిసినా సంబంధిత అధికారులు మరమ్మతులు చేయకపోవడం గమనార్హం. భారీ వర్షాలకు ముందే నోళ్లు తెరిచిన మ్యాన్‌హోళ్లను వెంటనే సరి చేయాలని కాలనీల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మ్యాన్‌హోళ్లను నాణ్యతా ప్రమాణాలతో చేపడితే తరచూ ధ్వంసం కాకుండా ఉంటాయని పేర్కొంటున్నారు. రోడ్డు లెవెల్‌కు సమాంతరంగా మ్యాన్‌హోళ్లను నిర్మించడంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. – ఓల్డ్ బోయిన్‌పల్లి





బడిబాటకు అనూహ్య స్పందన

- 407 ప్రభుత్వ పాఠశాలల్లో 9,037 మంది విద్యార్థుల చేరిక
- ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి 4,691 మంది..
- వచ్చేనెల 6 వరకు బడిబాట కార్యక్రమం పొడిగింపు
- కరోనా నేర్పిన కష్టకాలంతో మారిన తల్లిదండ్రుల వైఖరి
- ప్రభుత్వ బడుల్లో అన్ని సౌకర్యాలు ఉండటంతోనే..

సర్కారు బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రుల ఆసక్తి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరుగుతోంది. కరోనా కష్టకాలం నుంచి పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులు చెల్లించడం తల్లిదండ్రులకు తలకు మించిన భారం కావడంతో ప్రభుత్వ పాఠశాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి మించి ప్రభుత్వ బడుల అభివృద్ధి కోసం తెలంగాణ సర్కారు తీసుకుంటున్న చర్యలు కూడా విద్యార్థుల తల్లిదండ్రుల చూపు ప్రభుత్వ పాఠశాలల వైపు వెళ్లేలా చేస్తోంది. అందులో భాగంగానే సర్కారు బడులకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదరణ లభిస్తోంది. కోవిడ్–19 వైరస్ సృష్టించిన ఆర్థిక ఇబ్బందులు, నేర్పిన పాఠాలు పేద, మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రుల్లో పెను మార్పు తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. పైగా ప్రైవేట్ స్కూళ్లు ముఖ్యంగా కార్పొరేట్ పాఠశాలల్లో ఏడాదికి ఏడాది పెంచుతున్న అధిక ఫీజులను కూడా చెల్లించలేక చాలా మంది తల్లిదండ్రులు మారిన పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారు.

రికార్డు స్థాయిలో చేరికలు..

మేడ్చల్–మల్కాజిగిరిలో బడిబాట కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ నెల 3 నుంచి 9 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల(విద్యార్థుల) పేర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టిన విద్యాశాఖ 12 నుంచి 19వతేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని విద్యాశాఖ ఆర్భాటంగా, పెద్దఎత్తున చేపట్టింది. దీంతో బడిబాట కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఈ నేపథ్యంలోనే బడిబాటను వచ్చే నెల 6వ తేదీ వరకు పాఠశాల విద్యాశాఖ పొడిగించింది. జిల్లా విద్యాశాఖ నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో ఇప్పటి వరకు మేడ్చల్ జిల్లాలో 9,037 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఇందులో ప్రైవేట్ స్కూళ్ల నుంచి 4,691 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరడం రికార్డుగా జిల్లా విద్యాశాఖ పేర్కొంటోంది.

ప్రభుత్వ బడులపై ఆదరణ పెరిగిందిలా..

మేడ్చల్ జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలకు తగ్గట్టుగా అన్ని స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. అలాగే.. మనబడి–మన ఊరు–మన బస్తీ కార్యక్రమం కింద మొదటి విడతలో 176 ప్రభుత్వ బడుల్లో రూ.70 కోట్లతో మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన వంటి చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు 35 పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతుండటంతో పాటు విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ఉచిత పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం వంటి సదుపాయాలను కల్పిస్తున్న అంశాలను బడిబాటలో జిల్లా విద్యాశాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఫలితంగా బడిబాటకు అనూహ్య స్పందన లభిస్తోంది.

కరోనా నేర్పిన కష్టకాలం నుంచి..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కరోనా కష్టకాలంలో భాగంగా 2021–22 విద్యాసంవత్సరంలో 515 ప్రభుత్వ పాఠశాలల్లో 9,718 మంది విద్యార్థులు చేరగా, ఇందులో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 3,408 మంది ఉన్నారు. అలాగే.. 2022–23లో జిల్లాలో కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో 793 మంది విద్యార్థులు చేరగా, ఇందులో ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి వచ్చి చేరిన విద్యార్థులు 339 మంది ఉన్నారు.

మండలాల వారీగా ఇలా..

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తంగా 4,691 మంది విద్యార్థులు చేరగా, ఇందులో మండలాల వారీగా చేరిన విద్యార్థుల సంఖ్య ఈ విధంగా ఉంది. మేడ్చల్ మండలంలో 232 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరగా, దుండిగల్ మండలంలో 288, బాచుపల్లిలో 197, కుత్బుల్లాపూర్‌లో 448, కూకట్‌పల్లిలో 501.

◆ బాలానగర్‌లో 215, అల్వాల్‌లో 285, మల్కాజిగిరిలో 273, ఉప్పల్‌లో 694, మేడిపల్లిలో 140, కాప్రాలో 461, శామీర్‌పేటలో 141, కీసరలో 327, ఘట్‌కేసర్‌లో 439, మూడుచింతలపల్లిలో 50 విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ స్కూళ్లలో చేరారు.

‘తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమే..’



వివేకానందనగర్‌లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేస్తున్న మాధవరం కాంతారావు, నాయకులు

కూకట్‌పల్లి: మహాజన సంపర్క్ అభియాన్ పేరిట బీజేపీ నాయకులు ఇంటింటికీ బీజేపీ యాత్ర నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వివేకానంద్ నగర్ ఇన్‌చార్జ్ జయశ్రీ ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ అధ్యక్షుడు మాధవరం కాంతారావు నాయకత్వంలో ఇంటింటికి గడప గడపకు మోదీ సుపరిపాలనకు సంబంధించిన అంశాలను వివరిస్తూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ.. బీజేపీ భరోసా పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమే ధీమా వ్యక్తం చేశారు.

◆ ఆవాస్ యోజన పథకం ద్వారా పేదలందరికి నాలుగు కోట్ల ఇళ్లు నిర్మించారని తెలిపారు. 80 కోట్ల మందికి రేషన్ లబ్ధిదారులకు ప్రతి నెలా ఉచితంగా ఐదు కిలోల బియ్యం అందిస్తోందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఆరోగ్యబీమా అందిస్తోందని తెలిపారు. 11 కోట్ల మందికి మోదీ పాలనలో మరుగుదొడ్లు నిర్మించి మహిళల ఆత్మగౌరవాన్ని నిలిపారన్నారు. 9 కోట్ల మందికి ఉచిత వంట గ్యాస్ కనెక్షన్లు అందించారని తెలిపారు.

◆ మేడిన్ ఇండియా చొరవతో దేశీయ వస్తువులకు మంచి గుర్తింపు లభిస్తోందన్నారు. బీజేపీకి ఓటు వేస్తే మీ పిల్లలు బాగుపడతారని పేర్కొన్నారు. విద్యావంతులు, మేధావులు తెలంగాణ సమాజం ఆలోచించి రానున్న ఎన్నికల్లో అవినీతి, కుటుంబ పాలనను అంతమొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు డి. నరసింగ్‌రావు, జాయింట్ కన్వీనర్ మణిభూషణ్, ఉపాధ్యక్షులు వై. భాస్కర్‌రెడ్డి, ముత్యాలు, మల్లికార్జున్ రెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం



సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: డివిజన్ పరిధిలోని కల్వరి టెంపుల్, శ్రీల, బుద్ధ వర్టెక్స్, విశ్వంభరా, డ్రీమ్ వ్యాలీ కాలనీలో సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. పిల్లలకు, పెద్దలకు పార్కులు, క్రీడా మైదానాలు నిర్మించామని తెలిపారు. డివిజన్ ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, డీజీఎం శంషేర్, డీజీఎం చంద్రమోహన్, మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాటలు తప్ప అభివృద్ధి శూన్యం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్



సుభాష్‌చంద్రబోస్ నగర్‌లో పర్యటిస్తున్న రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో అభివృద్ధి శూన్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సుభాష్‌చంద్రబోస్ నగర్‌లో 64వ రోజు గడపగడపకు బీజేపీ రవన్న ప్రజాయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు, కాలనీలు, బస్తీలు అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలన్నారు. నేటి ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత విద్య, నిరుద్యోగ భృతి ఇలా ఎన్నో హామీలు ఇచ్చి తీర్చకుండా ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాధాకృష్ణ యాదవ్, మదనాచారి, మధు యాదవ్, శ్రీధర్, రాము, సూర్య, రాము, గోవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు, స్తంభాలకు దూరంగా ఉండాలి

కూకట్‌పల్లి: విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా కూకట్‌పల్లి డీఈ చక్రవర్తి, ఏడీఈ ప్రసాద్, హరికృష్ణలు విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. బలమైన గాలులు వీస్తున్నప్పుడు ప్రజలు విద్యుత్ తీగల కింద నిలబడొద్దన్నారు. విద్యుత్ వైర్లు తెగిపడితే వెంటనే విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించాలని కోరారు.

◆ ముఖ్యంగా వర్షాలు కురిసే సమయంలో విద్యుత్ ఐరన్, సిమెంట్ స్తంభాలను ముట్టుకోకుండా వాటికి దూరంగా ఉండాలన్నారు. అదే విధంగా విద్యుత్ సిబ్బంది, ప్రైవేట్ విద్యుత్ కార్మికులు, ఎలక్ట్రికల్ పనులు చేసేవారు తప్పనిసరిగా ఎర్త్‌రాడ్, చేతికి గ్లౌజులు, హెల్మెట్ వంటి పరికరాలు ధరించి పనిచేయాలని సూచించారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలో విద్యుత్‌కు సంబంధించిన ఏవైనా సమస్యలు, అంతరాయాలు కలిగితే కంట్రోల్ రూమ్ ఫోన్ నం.9490153502కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి డబుల్ ఇళ్ల దరఖాస్తుల సర్వే

- సర్కిల్ –21 పరిధిలో 8,389 దరఖాస్తులు
- 15 రోజుల్లో పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశం

హఫీజ్‌పేట్ : రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఉచితంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించనున్న నేపథ్యంలో తుది జాబితా రెడీ చేయడానికి జీహెచ్ఎంసీ, మండల రెవెన్యూ అధికారులు దరఖాస్తుల సర్వే చేయనున్నారు. ఈ సందర్భంగా చందానగర్ సర్కిల్ 21 ఉప కమిషనర్ సుధాంషు నందగిరి మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. సర్కిల్– 21 పరిధిలో డబుల్ ఇళ్లకు 8389 దరఖాస్తులు వచ్చాయని, బుధవారం నుంచి దరఖాస్తులను పరిశీలించి తరువాత సర్వే చేయనున్నారన్నారు. గతంలో యాప్ ద్వారా ఓటర్ కార్డు, సెల్ ఫోన్ నంబర్లు సేకరించామని, ఆ వివరాల ప్రకారం సర్వే చేస్తామన్నారు. సర్వేలో మొత్తం 14 టీమ్‌లు ఉండగా ఒక్కొక్క టీంలో బిల్ కలెక్టర్, మండల రెవెన్యూ సిబ్బంది ఉంటారన్నారు. 15 రోజుల్లో సర్వే పూర్తి చేసి తుదిజాబితాను ఉన్నతాధికారులకు పంపనున్నామన్నారు.

- రిజర్వేషన్ కింద ఎస్సీలకు 17 శాతం, ఎస్టీలకు 6 శాతం, మైనార్టీలకు 12 శాతం, ఇతరులకు 65 శాతం ఇవ్వనున్నారన్నారు.

అనర్హత..

- జీఓ 58, 59 కింద ఇళ్ల పట్టాలు పొందిన వారు... (జీఓ 58 కింద 30–12–2014 పొందిన వారు, జీఓ 59 కింద 30–12–2014 పొందిన వారు)
- పక్కా ఇళ్లు భర్త, భార్య పేర్ల మీద ఉండకూడదు
- రాష్ట్ర ప్రభుత్వం కింద గతంలో రూరల్, అర్బన్ పరిధిలో ఇళ్లు పొందిన వారు, ఇందిరమ్మ ఇళ్లు, జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే, రాజీవ్ గృహకల్పలో ఇళ్లు తీసుకున్నవారు అనర్హులుగా పేర్కొన్నారు.

అర్హత ఇలా..

- 2018వ సంవత్సరం వరకు ఓటర్ కార్డులో నమోదై ఉండాలి.
- ఆధార్ కార్డు, ఓటర్ కార్డు ఒకే నియోజకవర్గంలో, జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉండాలి
- జీహెచ్ఎంసీ పరిధిలో ఫుడ్ సెక్యూరిటీ కార్డు కలిగి ఉండాలి

యువ ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం

రాయదుర్గం: యువ ఓటర్లు బీజేపీవైపు మొగ్గు చూపుతున్నారని బీజేవైఎం రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కైతాపురం జితేందర్ స్పష్టం చేశారు. బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలో బీజేవైఎం ప్రధాన కార్యదర్శి నక్కా సామ్రాట్‌గౌడ్ ఆధ్వర్యంలో యువ ఓటరు నమోదు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. బీజేవైఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు బీజేవైఎం కృషి చేస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన తర్వాత 80 కోట్ల మంది పేదలకు ఉచితంగా ఆహారధాన్యాలు అందించారన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సురేష్‌ముదిరాజ్, మహేందర్‌గౌడ్, నరేందర్‌యాదవ్, సతీష్‌గౌడ్, అమర్, నవీన్‌రెడ్డి, రాఘవేందర్ ముదిరాజ్, సంకేష్‌సింగ్, ధరణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా నీటిని తీసుకెళ్తున్న వారిపై కేసు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ కాముని చెరువు నుంచి అక్రమంగా నీటిని తీసుకెళ్తున్న ట్యాంకర్ల యజమానులపై నీటిపారుదల శాఖ ఏఈ లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు అల్లాపూర్ ఠాణా సీఐ శ్రీపతి ఆంజనేయులు తెలిపారు. మంగళవారం ఉదయం సుమారు 11గంటల సమయంలో కాముని చెరువు నుంచి చెరువు కట్టను ధ్వంసం చేస్తూ ఆరు ట్యాంకర్ల ద్వారా నీటిని అక్రమంగా తీసుకెళ్తున్నట్లు తెలుసుకొని అక్కడకు వెళ్లారు. ట్యాంకర్ల సమాచారంతో పాటు యజమాని వివరాలను సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ వద్దంటూ..

విద్యార్థుల ప్రతిజ్ఞ



గచ్చిబౌలి: మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ఆయా పాఠశాలల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఇంటర్నేషనల్ యాంటి డ్రగ్స్ డేను పురస్కరించుకొని మంగళవారం సైబరాబాద్ కమిషనరేట్‌లోని మాదాపూర్ జోన్ పరిధిలో వివిధ పాఠశాలల్లో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. పాఠశాలల భద్రత, క్లబ్‌లు, డ్రగ్స్ వ్యతిరేక కమిటీలు గచ్చిబౌలిలోని విజయ భారతి హై స్కూల్, ప్రగతినగర్‌లోని గీతాంజలి స్కూల్, భెల్‌లోని విద్యా భారతి, మణికొండలోని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, కూకట్‌పల్లిలోని గీతాంజలి దేవకుల్, ఎస్ఎంపీ ఇంటర్నేషనల్ స్కూల్, మదీనాగూడలోని సెయింట్ యాన్స్, మేరు ఇంటర్నేషనల్ స్కూల్, శాన్ ఫోర్ట్ మోడల్‌స్కూల్ విద్యార్థుల ద్వారా నినాదాలు రాయించి సందేశం ఇచ్చారని డీసీపీ తెలిపారు.



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు